# జ్ఞానయోగి
# డా. బి.ఆర్. అంబేడ్కర్

---

ఆంగ్లమూలం

**డా. వెన్నెలకంటి ప్రకాశం**

అనువాదం

**డా. వారణాసి వేంకటేశ్వర్లు**

ఎమెస్కో

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | సామాజిక ఆసక్తులు | 7 |
| 2. | మతకాఠిన్యం | 24 |
| 3. | సమతా ఆర్థికశాస్త్రం | 38 |
| 4. | వ్యవసాయం, పరిశ్రమలు | 48 |
| 5. | కలుపుకొనిపోయే జాతీయత | 55 |
| | ముగింపు మాటలు | 65 |

# 1. సామాజిక ఆసక్తులు

డా.బి.ఆర్. అంబేద్కర్ 1891 సంవత్సరం ఏప్రిల్‌లో జన్మించాడు. కొలంబియా యూనివర్సిటీలోని ఆంత్రోపాలజీ విభాగం నిర్వహించిన సెమినార్‌లో తను పత్ర సమర్పణ చేసేనాటికి – మే 19, 1916 – ఆయన కేవలం పాతికేళ్ళయువకుడు. “భారతదేశంలోని కులాలు – వాని యంత్రాంగం, పుట్టుక, అభివృద్ధి” అనేది అంశం. మానవసంస్థపై వ్యాఖ్యానంగా ఆయన దానిని పేర్కొన్నాడు. ఈ పత్రాన్ని వర్ధమానులైన యువపరిశోధకులు అధ్యయనం చేస్తే, సదస్సుల్లో సమర్పించే పత్రాలు ఎలా ఉండాలో తెలుసుకుంటారు. ఈ పత్రంలో అంబేద్కర్ సంస్థాగత విశేషాలను వివరించినతీరు, ఉత్తమ పరిశోధకులకు ఆదర్శప్రాయం.

సామాజిక అధ్యయనానికి సమాజగతమైన పలు సమూహాల పుట్టు పూర్వోత్తరాల అధ్యయనానికి గల తేడాను గమనిస్తే – అంబేద్కర్ ఈ పత్రంలో చేయబూనింది సమాజంలోని వివిధ కులాలు రూపొందిన విధాన్ని ఇందులో నిశితంగా పరిశీలించటమని అర్థమౌతుంది. సామాజిక వర్గాల సంబంధాలను అంబేద్కర్ ఎలాంటి పద్ధతిలో ఈ వ్యాసంలో వెలుగులోకి తెచ్చాడో మనం ఈ విభాగంలో గమనిద్దాం.

స్పష్టత, లోతైన ఆలోచన, వినయం అనేవి గొప్పమేధావిలో ఉండాల్సిన లక్షణాలు. భారతీయ సాంస్కృతిక ఐక్యతను గూర్చి ఈ పత్రంలో ఆయన ఏమన్నాడో చూద్దాం:

“.......నేనీసమస్యను సమగ్రంగా చర్చించబోవటం లేదు. ఈ వ్యవస్థకు సంబంధించిన ఒక పార్శ్వాన్ని మాత్రమే ఇప్పుడు ఇక్కడ నేను చర్చిస్తాను. లేకుంటే నేను సఫలీకృతుణ్ణి కాలేను. కాలం, అవకాశం, ఆలోచనల తీవ్రత నన్ను విఫలుణ్ణి చేయవచ్చు. అందుకనే కులవ్యవస్థ పుట్టుక, యంత్రాగం, వృద్ధి, వ్యాప్తి – వీటిని మాత్రమే ఇక్కడ చర్చిస్తాను.

మానవవర్గ విశ్లేషణ ప్రకారం ప్రజలంతా సంకరజాతికి చెందినవారే. సాంస్కృతిక ఐక్యత వారి సజాతీయతకు ఆధారం. ఈ అంశాన్ని ఆమోదిస్తే, సాంస్కృతిక ఐక్యత

విషయంలో భారత ఉపఖండంతో సాటివచ్చే మరో దేశమేదీలేదని చెప్పేందుకు నేను సాహసిస్తున్నాను. ఆమూలాగ్రంగా ఈ దేశంలో భౌగోళిక ఐక్యతేకాక, సంశయాలకు తావివ్వని సాంస్కృతిక ఐక్యత కూడ వ్యాపించి ఉంది. అయితే సజాతీయమైన ఈ ఐక్యతను విభజించేది కులం. కులం ఆవిర్భవించిన విధాన్ని వివరించటమంటే, ఈ విభజన ప్రక్రియను వివరించటమే...." (అదే గ్రంథం 6)

"ఈ అంశాన్ని ఆమోదిస్తే", "చెప్పేందుకు నేను సాహసిస్తున్నాను" లాంటి భావాలను చర్చకు తావిచ్చేవిధంగా చెప్పటం ఆయన పాండిత్యానికి నిదర్శనం. వాస్తవానికి ఈ పత్రం ఆయన మేధావిత్వానికి తొలి మెరుపు మాత్రమే. కుల విభేదాల ఆవిర్భావం, వివాహపరమైన అంతర్గత, బహిర్గత విధానాలతో ఎలా ముడిపడి ఉందో తెలుపుతూ "భారతదేశానికి సంబంధించినంతవరకు కులాలసృష్టిని గూర్చిన చివరి విశ్లేషణ అంటే వివాహవిధానంలోని బాహ్యానియమంపై అంతర్నియమాన్ని ఆపాదించటమే........" (అదే గ్రంథం – పేజి 9) అని సమన్వయం చేస్తాడు.

స్త్రీ పురుషుల మధ్య సంఖ్యాపరమైన అసమానతలు; కట్టుదిట్టమైన, చొరబాటుకు తావివ్వని కులవ్యవస్థ సృష్టిలో అనుకరణ పాత్ర – వీటిని గురించి అంబేద్కర్ చర్చిస్తాడు. ఏ విషయసమస్యనైనా పరిష్కరించేందుకై మనమెంత లోతుగా ఆలోచించాలో తెలియజేస్తాడు.

ఏ అంశాన్నీ హేతుబద్ధతలేకుండా, సోదాహరణ వివరణ లేకుండా ఆయన ప్రతిపాదించడు.

"ప్రజల రాజకీయ విస్తృతికి వారి బుద్ధి, మనశ్శక్తులు దాసస్వభావం నుండి విముక్తం కావటమే ప్రాథమిక ఆవశ్యకత...." అంటూ (BAWS I : 44) ఈ సందర్భంగా ఆయన ఎన్నో ఉదాహరణలిస్తాడు.

హిందూ సమాజంలోని మతసంబంధప్రచార స్వభావాన్ని లేదా తద్భిన్నమైన స్వభావాన్ని ఆయన పరిశీలించిన తీరు గమనార్హం. సహేతుకమైన మూల్యాంకనం చేస్తాడేతప్ప, భావోద్రేకతకు తావివ్వడు.

"హిందూమతం ఒకప్పుడు ప్రచారశీలమైనదే అని ఒప్పుకొని తీరాలి. అలాంటిదేకాకపోతే భారతదేశమంతటా అది వ్యాపించిఉండేదేకాదు. ప్రస్తుతం అది ప్రచారశీలంలేనిది అనే వాస్తవాన్నీ మనం అంగీకరించితీరాలి. హిందూమతం ప్రచారశీలం కలదా కాదా అనేది ఇక్కడి ప్రశ్నకాదు.